
సూర్య
www.suryaa.com
17 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
www.suryaa.com
4 PM
www.suryaa.com
గురువారం
18 ఏప్రిల్ 2024
పేజీలు: 02



మనీష్ సిసోడియా జ్యుడీషియల్
## కస్టడీ పొడిగింపు

ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని కోర్టు పొడిగించింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో ఆయనను పోలీసులు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ తర్వాత కస్టడీని ఏప్రిల్ 26 వరకు కోర్టు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో ఆయనను ఈడీ గత ఏడాదిలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల..
# నేటి నుంచే నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికల్లో ఇవాళ కీలక ఘట్టం చోటుచేసుకుంది. నాలుగో దశ సార్వత్రిక ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ గురువారం (ఏప్రిల్ 18) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలు సహా 10 రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్, సిక్కిం, పశ్చిమ బెంగాల్, జమ్మూకశ్మీర్.. రాష్ట్రాల్లో మొత్తం 96 లోక్‌సభ స్థానాలకు గానూ 4వ దశ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఈ రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది. సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. పార్లమెంట్ స్థానాలకు కలెక్టరేట్‌లలో, అసెంబ్లీ స్థానాలకు ఆయా నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ చేపడతారు. లోక్‌సభ అభ్యర్థి రూ.25 వేలు, శాసనసభ అభ్యర్థి రూ.10 వేలు చొప్పున ధరావతు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఇందులో 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే ఆర్వో కార్యాలయం లోపలికి అనుమతి ఉంటుంది. నామినేషన్ వేసే అభ్యర్థుల ఊరేగింపుతో పాటు దాఖలు చేసే ప్రాంతంలో పూర్తిగా వీడియో రికార్డింగ్ చేస్తారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయనున్నారు. రేపు, ఈనెల 22, 25 తేదీలు మంచి రోజులు కావడంతో ఎక్కువ నామినేషన్‌లు వేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ఏప్రిల్ 29న ప్రకటించనున్నారు. ఇక నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29న అవకాశం ఇచ్చారు. మే 13న పోలింగ్ ఉంటుంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు. ఓటుహక్కు వినియోగించుకునే విషయంలో 85 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించారు. మే 8లోపు వీరు ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉన్నది. మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో నేటి (గురువారం) నుంచి ఓటింగ్ పూర్తయ్యే వరకు బ్యాంకు లావాదేవాలపై నిఘా పెడుతున్నారు. బ్యాంకుల నుంచి లక్ష రూపాయాలు, ఆపై డ్రా చేసినా, జమ చేసినా ఆ ఖాతాలను పరిశీలించ న[redacted]




## ఏపీ, తెలంగాణలో ఎన్నికల సమరం

| | |
|---|---|
| ఏప్రిల్ 18 | నోటిఫికేషన్ విడుదల |
| ఏప్రిల్ 18 | నామినేషన్ల స్వీకరణ ప్రారంభం |
| ఏప్రిల్ 25 | నామినేషన్ల దాఖలకు చివరి తేదీ |
| ఏప్రిల్ 26 | నామినేషన్ల స్క్రూటినీ |
| ఏప్రిల్ 29 | నామినేషన్ల ఉపసంహరణకు గడువు |
| మే 13 | పోలింగ్ తేదీ |
| జూన్ 04 | ఓట్ల లెక్కింపు |
| జూన్ 06 | ఎన్నికల కోడ్ ముగింపు |



మెడికల్ గోడౌన్‌లో
## భారీ అగ్ని ప్రమాదం

విజయవాడ బందర్ రోడ్‌లోని కేడీసీసీ బ్యాంక్ సమీపంలో గల మెడికల్ గోడౌన్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన సిబ్బంది ప్రాణ భయంతో పరుగులు తీశారు. భారీగా పొగ కమ్మేయటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఫైరింజన్లతో మంటలను అదుపు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల దాడి..
## 17 మంది మృతి

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతునే ఉన్నాయి. ఉత్తర ఉక్రెయిన్‌లోని చెర్నివ్ నగరంపై మాస్కో క్షిపణులను ప్రయోగించింది. అవి ఎనిమిది అంతస్తుల భవనంపై పడటంతో 17 మంది మృతిచెందారు. 61 మంది గాయపడ్డారు. వారిలో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారని ఉక్రెయిన్ ఎమర్జెన్సీ సర్వీస్ తెలిపింది. చెర్నివ్ రాజధాని కీవ్‌కు ఉత్తరాన 150 కిలోమీటర్ల దూరంలో రష్యా – బెలారస్ సరిహద్దులకు సమీపంలో ఉంది. ఇరుదేశాల మధ్య 2022, ఫిబ్రవరిలో ప్రారంభమైన యుద్ధం.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది. రష్యా భారీస్థాయిలో దాడులు నిర్వహిస్తుండగా, ఆయుధాల కొరతతో ఇబ్బండి పడుతున్న ఉక్రెయిన్ దళాలులు చాలా ప్రాంతాల్లో వెనక్కి మళ్లుతున్నాయి. రష్యా దాడితో భవనాలు పెద్ద సంఖ్యలో దెబ్బతిన్నాయని ఉక్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రి ఇహోర్ క్లిమెంకో తెలిపారు. కార్లు, [redacted]



టాప్-100లో నాలుగు భారతీయ
## విమానాశ్రయాలు

ప్రపంచ ఉత్తమ విమానాశ్రయాల జాబితాలో మన దేశం నుంచి కేవలం 4 ఎయిర్‌పోర్టులే స్థానం దక్కించుకున్నాయి. ప్రముఖ స్కైట్రాక్స్ తాజాగా 12వ వరల్డ్ ఎయిర్‌పోర్ట్ అవార్డులను ప్రకటించింది. అందులో దోహాలోని హమద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచంలోనే అత్యుత్తమ ఎయిర్‌పోర్టుగా నిలిచింది. ఇక ఢిల్లీ విమానాశ్రయం 36వ ర్యాంకు, బెంగళూరు ఎయిర్‌పోర్టు 59వ ర్యాంకు, హైదరాబాద్ విమానాశ్రయం 61వ ర్యాంకు, ముంబై ఎయిర్‌పోర్టు 94వ స్థానం దక్కించుకున్నాయి.



## కేరళలో బర్డ్ ఫ్లూ కలకలం

కేరళలో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. అలప్పుజ జిల్లాలో రెండు చోట్ల బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందినట్లు అధికారులు గుర్తించారు. ఎడత్వ గ్రామ పంచాయతీలోని 1వ వార్డులో, చెరుతన గ్రామ పంచాయతీలోని 3వ వార్డులోని మరో ప్రాంతంలో పెంచుతున్న బాతులకు బర్డ్ ఫ్లూ ఉన్నట్లు [redacted]

## రాజ్ కుంద్రా రూ.100 కోట్ల ఆస్తులు జప్తు



ప్రముఖ బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రాకు సంబంధించిన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. పీఎంఎల్‌ఏ చట్టం 2002 కింద రూ.97.79 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేసింది. ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల్లో జుహులో శిల్పాశెట్టి పేరు మీద ఉన్న రెసిడెన్షియల్ ఫ్లాట్, పుణెలోని ఓ బంగ్లా, రాజ్ కుంద్రా పేరు మీద ఈక్విటీ షేర్లు ఉన్నాయి. దివంగత అమిత్ భరద్వాజ్, అజయ్ భరద్వాజ్, వివేక్ భరద్వాజ్, సింపీ భరద్వాజ్, మహేందర్ భరద్వాజ్ ఇతరుల[redacted] మహారాష్ట్ర పోలీసులు, ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన బహుళ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. నిందితులు బిట్‌కాయిన్‌ల రూపంలో నెలకు 10 శాతం రిటర్న్ ఇస్తామని తప్పుడు వాగ్దానాలతో ప్రజల నుంచి బిట్‌కాయిన్‌ల రూపంలో (2017లోనే రూ. 6,600 కోట్లు) భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. సేకరించిన బిట్‌కాయిన్‌లు బిట్‌కాయిన్ మైనింగ్ కోసం ఉపయోగించబడాలి. పెట్టుబడిదారులు క్రిప్టో ఆస్తులలో భారీ రాబడిని పొందవలసి ఉంది. కానీ ప్రమోటర్లు పెట్టుబడిదారులను మోసం చేశారు. అస్పష్టమైన ఆన్‌లైన్ వాలెట్లలో అక్రమంగా సంపాదించిన బిట్‌కాయిన్‌లను దాచారు.



బొగ్గు రవాణా లారీలు నిలిపివేయాలని
## గ్రామస్తుల ఆందోళన

బొగ్గు రవాణా లారీలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామస్తులు గురువారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా చపట్టారు. బొగ్గు రవాణా కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## కన్నప్పలో కాజల్



[redacted] మరి ఈ చిత్రం విష్ణు కెరీర్ లోనే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ సహా తన డ్రీం ప్రాజెక్ట్ కూడా కాగా ఈ సినిమా పాన్ ఇండియా వైడ్ గా ఒక బిగ్గెస్ట్ మల్టీ స్టారర్ గా ఇది మారుతూ వెళ్తుంది. అయితే రీసెంట్ గానే బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ్ కుమార్ కూడా నటిస్తున్నట్టుగా వార్తలు రాగా కన్నప్ప సినిమా పేరు మరింత స్థాయిలో వినిపించింది. అయితే లేటెస్ట్ గా సినిమా భారీ తారాగణంలో మరో స్టార్ నటి పేరు బయటకి వచ్చింది. ఆమె ఎవరో కాదు సౌత్ ఇండియా స్టార్ నటి కాజల్ అగర్వాల్. ఈమె కూడా ఇప్పుడు ఈ సినిమాలో కనిపిస్తుంది అని కొన్ని రూమర్స్ మొదలయ్యాయి. అయితే ఇది దాదాపు నిజం అన్నట్టుగానే వినిపిస్తుంది.

## [redacted] స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ.. మన సూచీలు సానుకూలంగా ప్రారంభమవడం విశేషం. ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 334 పాయింట్లు లాభపడి 73,278 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 120 పాయింట్లు పెరిగి 22,268 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.49 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో పవర్ గ్రిడ్, టాటా స్టీల్, ఎం అండ్ ఎం, టాటా మోటార్స్, రిలయన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ అండ్ టి, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే ఇండియా, ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, టైటన్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా షేర్లు నష్టాల్లో ఉన్నాయి.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## ప్రియదర్శిపై
## నభా నటేశ్ కామెంట్స్

'ఇస్మార్ట్ శంకర్'తో తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు నటి నభా నటేశ్. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆమె కొంతకాలంగా చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నారు. ఇప్పుడిప్పుడే తిరిగి సినిమాల్లోకి వస్తున్నారు. ఇదిలా ఉండగా.. సోషల్‌మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే ఈ భామకు నటుడు ప్రియదర్శికి మధ్య తాజాగా జరిగిన సంభాషణ నెట్టింట వైరల్‌గా మారింది. కామెంట్ చేసేముందు మాటలు సరిచూసుకోవాలంటూ ఆమె ప్రియదర్శికి సూచించారు.




## గూగుల్‌లో మరోసారి
# ఉద్యోగుల తొలగింపు
## తోషిబాలోనూ 5,000 మంది!

ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ మరోసారి ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాసిన అంతర్గత లేఖలో వెల్లడించారు. పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగానే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు.

**సీఎఫ్‌వో ఏం చెప్పారంటే..**

"కృత్రిమ మేధ వల్ల టెక్ రంగంలో మార్పులు వస్తున్నాయి. మన కోట్లాది మంది కస్టమర్లకు మెరుగైన ఉత్పత్తులను అందించడానికి ఇది ఒక సదావకాశం. ఈ క్రమంలో కఠిన నిర్ణయాలూ తీసుకోవాల్సి వస్తోంది. మన ప్రాధాన్యాలు ఏంటో గుర్తించి వాటిపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఫలితంగా నైపుణ్యం కలిగిన కొంతమంది సభ్యులను బయటకు పంపాల్సి వస్తోంది. ఇది చాలా కష్టమైన విషయమని మాకు తెలుసు" అని ఉద్యోగులకు రాసిన లేఖలో సీఎఫ్‌వో తెలిపారు. 2024లో మరింత మంది ఉద్యోగులను తొలగిస్తామని సీఈవో సుందర్ పిచాయ్ గతంలోనే వెల్లడించిన విషయం తెలిసిందే.

**ఎంత మందిపై వేటు..**

పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొంత మంది ఉద్యోగులను ఇతర విధుల్లోకీ గూగుల్ బదిలీ చేస్తోంది. భారత్‌లో కార్యకలాపాలను విస్తరిస్తున్న ఆ సంస్థ.. కొంతమందిని ఇక్కడకూ తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మొత్తంగా ఎంత మందిని తొలగిస్తున్నారు? ఎంత మందిని బదిలీ చేస్తున్నారనే విషయాన్ని కంపెనీ బహిర్గతం చేయలేదు.

**2024లో టెక్ లేఆఫ్స్..**

ప్రపంచవ్యాప్తంగా అనేక టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. టెస్లా, యాపిల్, అమెజాన్ వంటి పెద్ద సంస్థలు సైతం తమ సిబ్బందిని తగ్గించుకున్నాయి. 2024లో ఇప్పటి వరకు దాదాపు 58 వేల మంది ఉద్వాసనకు గురైనట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**తోషిబాలో 5,000 మందిపై వేటు**

జపాన్‌కు చెందిన బడా కంపెనీ తోషిబా సైతం ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. నిక్కీ నివేదిక ప్రకారం.. దాదాపు 5,000 మందిని తొలగించనుంది. కంపెనీ సిబ్బందిలో ఇది 10 శాతానికి సమానం. ఇన్‌ఫ్రా, డిజిటల్ టెక్ వంటి కీలక రంగాలపై దృష్టి సారించడంలో భాగంగానే పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలను అమలు చేస్తోంది. జపాన్‌లో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న కంపెనీల్లో తోషిబా ఒకటి. ఇటీవల ఈ సంస్థను ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. నిర్వహణ లోపాలు, అవినీతి ఆరోపణలూ వచ్చాయి. అకౌంటింగ్‌లో అక్రమాలకు సంబంధించి పెద్ద ఎత్తున జరిమానా కూడా చెల్లించింది. మెమొరీ చిప్ వ్యాపారాన్ని విక్రయించింది. జపాన్‌లో ఉద్యోగులను తీసివేయడం చాలా అరుదు. అక్కడి చట్టాలే అందుకు కారణం. కానీ, ఈ మధ్య కొన్ని కంపెనీలు పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించాయి. ఇది అక్కడి కార్పొరేట్ సంస్కృతిలో వచ్చిన మార్పులను సూచిస్తోంది. అయితే, దేశంలో ఉద్యోగుల కొరత ఉండడంతో పెద్దగా నిరసనలు వెల్లువెత్తడం లేదు. ఉద్వాసనకు గురైన వారు ఇతర కంపెనీల్లో సులువుగానే చేరిపోతున్నారు.



## నా భార్యకు ఏదైనా జరిగితే..
## పాక్ ఆర్మీ చీఫ్‌కు
# ఇమ్రాన్‌ఖాన్ వార్నింగ్

పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌పై ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తన భార్య బుష్రా బీబీ అరెస్టుకు మునీరే కారణమని ఆరోపించారు. ఆమె ప్రస్తుతం ఓ అవినీతి కేసులో శిక్ష అనుభవిస్తున్నారు. ఇస్లామాబాద్ శివారులోని నివాసంలో గృహనిర్బంధంలో ఉన్నారు. బుష్రా బీబీకి శిక్ష విధించిన న్యాయమూర్తే తనతో మాట్లాడినట్లు ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. తీర్పు విషయంలో తనపై ఒత్తిడి ఉండేదని చెప్పినట్లు వెల్లడించారు. ఒకవేళ తన భార్యకు ఏదైనా జరిగితే సహించేది లేదని ఇమ్రాన్ హెచ్చరించారు. తాను బతికున్నంత వరకు మునీర్‌ను వదిలిపెట్టేది లేదని వార్నింగ్ ఇచ్చారు. మునీర్ తీసుకుంటున్న రాజ్యాంగ విరుద్ధ, అక్రమ నిర్ణయాలను బహిర్గతం చేస్తానని వ్యాఖ్యానించారు. "దేశంలో ఆటవిక రాజ్యం నడుస్తోంది. ఆ అడవికి రాజే అన్నీ నిర్ణయిస్తాడు. ఆయన కోరుకుంటే నవాజ్ షరీఫ్ నేరాలన్నింటినీ క్షమించేస్తారు. అలాగే మాకు ఐదు రోజుల్లో మూడు కేసుల్లో శిక్ష విధిస్తారు" అని పరోక్షంగా మునీర్‌ను ఉద్దేశించి ఇమ్రాన్ ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఐఎంఎఫ్ రుణాల ద్వారా గాడినపడదని అన్నారు. పెట్టుబడుల ద్వారా మాత్రమే ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం వస్తుందని సూచించారు. దేశంలో చట్టం పటిష్ఠంగా అమలైనప్పుడే పెట్టుబడులు వస్తాయని.. ఆటవిక రాజ్యం అమల్లో ఉన్నంత కాలం అది సాధ్యం కాదన్నారు. ఇమ్రాన్ చేసిన ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు పాక్ ఆర్మీ స్పందించలేదు.



## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫిర్యాదు..
### కేసీఆర్ అన్న కుమారుడిపై మరో కేసు

మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ అన్న కుమారుడు కన్నారావుపై మరో కేసు నమోదైంది. ఆయనతో పాటు ఐదుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తనను బెదిరించి డబ్బు తీసుకున్నట్లు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వారిపై ఫిర్యాదు చేశాడు. గెస్ట్‌హౌస్‌లో నిర్బంధించి దాడి చేశారని అందులో పేర్కొన్నాడు. ఓ సమస్య పరిష్కారం కోసం కన్నారావు వద్దకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విజయవర్ధన్ రావు వెళ్లారు. కన్నారావుకు పరిచయస్తురాలైన నందిని.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద నగలు, నగదు ఉన్నాయన్న విషయం ఆయనకు తెలిపింది. సదరు మహిళతో పాటు మరికొంత మందితో కలిసి ఆయన విజయవర్ధన్ రావును గెస్ట్ హౌస్‌లో నిర్బంధించాడు. అతడిని బెదిరించి రూ.60 లక్షల నగదు, 97 తులాల బంగారం దోచుకున్నాడు. తనకు పోలీసు అధికారి భుజంగరావు, ఏసీపీ కట్టా సాంబయ్య తెలుసంటూ కన్నారావు బెదిరించాడని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మన్నెగూడ భూవివాదంలో ఇప్పటికే కన్నారావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.



## గ్రేటర్‌లో బీఆర్‌ఎస్‌కు మాజీ ఎమ్మెల్యే షాక్..
## ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే
# బేతి సుభాష్ రెడ్డి రాజీనామా

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై అధికారంలో కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు నేతలు అధికార కాంగ్రెస్ పార్టీ, బీజేపీలోకి క్యూ కడుతున్నారు. అయితే తాజాగా మరో నేత బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రటించారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు తన రాజీనామా లేఖ పంపారు సుభాష్ రెడ్డి. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు మద్దతు ఇవ్వనున్నట్లు బేతి సుభాష్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ పలువరు కీలక నేతలు బీఆర్ఎస్‌ను వీడటం ఆ పార్టీని ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నగేందర్ ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వారితో పాటు కే. కేశవరావు, పట్నం మహేందర్‌రెడ్డి వంటి పలువురు కీలక నేతలు కూడా బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి అధికార కాంగ్రెస్ కండువ కప్పుకున్నారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నగేందర్‌ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నిలపటం గమనార్హం.

## ఆ లక్ష్యంతోనే బరిలోకి దిగాం



అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్‌ను పంత్‌సేన చిత్తు చేసింది. ఆ జట్టు విసిరిన కేవలం 90 పరుగుల లక్ష్యాన్ని దిల్లీ తొమ్మిది ఓవర్లలోపే పూర్తి చేసింది. దీంతో రన్‌రేట్‌ను మెరుగుపర్చుకుని ఆరో స్థానానికి ఎగబాకింది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ రిషభ్ పంత్ జట్టు వ్యూహంపై స్పందించాడు. ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే పాయింట్లతోపాటు నెట్‌రన్‌రేట్ కీలకమని.. అందుకే దూకుడుగా ఆడాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించాడు. "గుజరాత్‌తో మ్యాచ్‌లో చాలా విషయాల్లో మెరుగ్గా రాణించాం. ఛాంపియన్ ఆలోచనా విధానంతో బరిలోకి దిగాం. అలానే ఆడి విజయం సాధించాం. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు బౌలింగ్ పరంగా ఇదే అత్యుత్తమం. భారీ విజయం సాధించాలన్న లక్ష్యాన్ని ముందే ఎంచుకొన్నాం. ఛేజింగ్‌లోనూ ఇదే తీరుతో ఉన్నాం. వీలైనంత వేగంగా టార్గెట్‌ను కొట్టేయాలని భావించాం. గతంలో మా రన్‌రేట్ బాగా పడిపోయింది. దాని కోసం ఇలాంటి మ్యాచులతో మెరుగయ్యే అవకాశం దక్కుతుంది. వికెట్లు పడినా వేగంగా పరుగులు సాధించడానికే మొగ్గు చూపాం. అహ్మదాబాద్ పిచ్ చాలా బాగుంది. కీలక సమయంలో విజయం సాధించడం ఆనందంగా ఉంది" అని పంత్ వ్యాఖ్యానించాడు.

**మ్యాచ్ విశేషాలు..**

రిషభ్ పంత్‌కు ఏడోసారి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. దిల్లీ తరఫున వీరేంద్ర సెహ్వాగ్ (10) మాత్రమే అత్యధికంగా దీనిని సొంతం చేసుకున్న క్రికెటర్.

ఐపీఎల్‌లో బంతుల పరంగా దిల్లీకిదే భారీ విజయం. గుజరాత్‌పై 67 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. అంతకుముందు ముంబయిపై (2022) 57 బంతులు మిగిలి ఉండగా గెలిచింది.

ఐపీఎల్‌లో 90+ టార్గెట్‌ను అతి తక్కువ ఓవర్లలో పూర్తి చేయడం ఇది మూడోసారి. ఇప్పుడు గుజరాత్‌పై దిల్లీ 8.5 ఓవర్లలో లక్ష్య ఛేదన చేసింది. అంతకుముందు రాజస్థాన్‌పై కొచ్చి (2011లో 98 పరుగులు) 7.2 ఓవర్లు, రాజస్థాన్‌పై ముంబయి (2021లో 91 పరుగులు) 8.2 ఓవర్లలో పూర్తి చేసి గెలిచాయి.

ఐపీఎల్ 2024 పవర్‌ప్లే ఓవర్లలో అత్యధిక వికెట్లను కోల్పోయిన జట్టుగా దిల్లీ నిలిచింది. ఇప్పటి వరకు ఆ జట్టు 13 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత లఖ్‌నవూ (12) ఉంది.




## భారీ వర్షం.. నిలిచిన విమానాలు

ప్రపంచంలోనే రద్దీగా ఉండే ఎయిర్‌పోర్ట్‌ల్లో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఒకటి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తడంతో భారత్ నుంచి దుబాయ్ వెళ్లే విమానాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాంతో ఎయిర్ ఇండియా, ఇండిగో తమ సర్వీసులను రద్దు చేసినట్లు ప్రకటించాయి. ఢిల్లీ విమానాశ్రయంలో దుబాయ్‌కి వెళ్లే పది విమానాలు, దుబాయ్ నుంచి వచ్చే తొమ్మిది విమానాలను రద్దు చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. భారత్‌లోని వివిధ నగరాల నుంచి ఎయిరిండియా దుబాయ్‌కి వారానికి 72 విమానాలను నడుపుతోంది.'రాబోయే కొద్ది రోజుల్లోనే పూర్తి స్థాయిలో విమానాలను నడిపేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం బాధిత ప్రయాణికులకు వసతి కల్పించడానికి కృషిచేస్తున్నాం. 16, 17 తేదీల్లో ప్రయాణాలకోసం టికెట్ బుక్‌చేసినవారు ఒకసారి తేదీ మార్చుకునేందుకు అవకాశం కల్పించనున్నాం. దాంతో వారు తమ గమ్యస్థానాలు చేరేలా ఏర్పాటు చేస్తున్నాం'అని ఒక ప్రతినిధి చెప్పారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, ఇండిగో, స్పైస్‌జెట్‌తో సహా ఇతర విమానయాన సంస్థలు దుబాయ్‌కి వెళ్లే మార్గంలో అంతరాయాన్ని ఎదుర్కొన్నాయి.



## మిరాయ్ టైటిల్ గ్లింప్స్..
## మరోసారి సర్ప్రైజ్ చేయబోతున్న తేజ సజ్జ

లేటెస్ట్ టాలీవుడ్ సెన్సేషనల్ హిట్ చిత్రం "హను మాన్"తో పాన్ ఇండియా ఫేమ్ ని అందుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జ చేస్తున్న తదుపరి చిత్రమే "మిరాయ్". టాలీవుడ్ యాక్షన్ మూవీ లవర్స్ కి మాస్ మహారాజ్ రవి తేజతో "ఈగల్" అనే చిత్రంతో క్రేజీ ట్రీట్ ని అందించిన టాలెంటెడ్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా ఈ చిత్రంలో సూపర్ యోధా గా తేజ కనిపించనున్నాడు. మరి ఇంట్రెస్టింగ్ ప్రీ లుక్ పోస్టర్స్ తో ఆసక్తి రేపిన మేకర్స్ ఇప్పుడు టైటిల్ రివీల్ చేస్తూ ఇంట్రెస్టింగ్ గ్లింప్స్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. అనుకున్నట్టుగానే "మిరాయ్" అంటూ టైటిల్ ని అనౌన్స్ చేసిన మేకర్స్ ఒక ఊహించని ట్రీట్ ని అయితే ఈ సినిమాతో అందిస్తున్నారని చెప్పాలి. సామ్రాట్ అశోక కళింగ యుద్ధం ఆ పరిణామాల తర్వాత వచ్చిన 9 గ్రంథాలు వాటిని తరాలుగా కాపాడుతూ వస్తున్నా 9 మంది యోధులు అంటూ ఓ రేంజ్ ఆసక్తిని ఈ గ్లింప్స్ రేకెత్తించింది.అంతే కాకుండా ఆ యాక్షన్ విజువల్స్ అయితే మైండ్ బ్లాకింగ్ గా బిగ్ స్క్రీన్స్ పై ప్రామిసింగ్ ట్రీట్ ని అందించబోతున్నాయి అని అనిపిస్తుంది. ఇక సూపర్ యోధాగా తేజ సజ్జ మరోసారి షైన్ అయ్యాడు అని చెప్పాలి. హను మాన్ లో సూపర్ హీరోగా అదరగొట్టిన తను ఇప్పుడు ఈ సినిమాలో కూడా సాలిడ్ ట్రీట్ ను తన సైడ్ నుంచి ఇవ్వబోతున్నట్టుగా అనిపిస్తుంది.ఆ యాక్షన్ సీక్వెన్స్ లు తన ప్రెజెన్స్ అంతా వేరే లెవెల్లో కనిపిస్తుంది. ఇక చిత్రానికి కూడా హను మాన్ మ్యూజిక్ దర్శకుడు గౌర హరి నే సంగీతం అందిస్తుండగా తన స్కోర్ ఈ టీజర్ గ్లింప్స్ లో మరింత ఆకర్షణగా నిలిచింది. ఇంకా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారి నిర్మాణ విలువలు అయితే ఇందులో ఎక్స్ట్రార్డినరీగా కనిపిస్తున్నాయి. ఇక ఈ భారీ చిత్రాన్ని మేకర్స్ వచ్చే ఏడాది ఏప్రిల్ 19న 3డి లో కూడా రిలీజ్ చేయబోతుండడం విశేషం. అలాగే ఈ సినిమా 7 భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కాబోతుంది.